# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

సోమవారం / 25.03.2024 https://telanganaveena.com/ epaper.telanganaveena.com


# తెలంగాణ ప్రజలకు రేవంత్ సర్కార్ శుభవార్త..

>>తెలంగాణ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు
>>జులై నుంచి పంపిణీ చేస్తామన్న మంత్రి
>>పేరు టైప్ చేస్తే సమగ్ర వైద్య సేవల వివరాలు



**తెలంగాణ వీణ , హైదరాబాద్** : తెలంగాణ ప్రజలకు రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. రాష్ట్ర ప్రజలకు వచ్చే జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను అందజేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో మంథని వైదిక సంస్థ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబుకు సత్కార సభ జరిగింది. ఆధార్ కార్డు సంఖ్య తరహాలో ఒక్కో పౌరుడికీ స్మార్ట్‌కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ సంఖ్యతో గుర్తింపు కల్పిస్తామన్నారు. పేరు టైప్ చేస్తే సమగ్ర వైద్య సేవల వివరాలు తెలుసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ఏ వైద్యుడిని సంప్రదించినా వారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందన్నారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఎలాంటి భేషజాలకు పోకుండా ప్రజలు గర్వించేలా పనిచేస్తామన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలకు ఎమ్మెల్యేల క్వార్టర్లలోని డిస్పెన్సరీలతోపాటు అన్ని ఆసుపత్రుల్లో చికిత్సకు అనుగుణంగా మందుల్ని సరఫరా చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యేలు రాజేశంగౌడ్, ఆంజనేయులు, సత్యనారాయణగౌడ్ తదితరులు మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి మందుల సరఫరాలో కొరతను తీర్చాలని వివరించారు. మందుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.తన తండ్రి శ్రీపాదరావు మరణానంతరం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తనను పార్టీలోకి ఆహ్వానించారని.. తన తల్లి జయశ్రీ ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు శ్రీధర్. తన 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో 5 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉంటూ రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో సేవలందించాలంటే చాలా సహనం ఉండాలన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో తనకు గన్‌మెన్‌ను తొలగించినా.. భయపెట్టే ప్రయత్నం చేసినా.. వెనకడుగు వేయలేదని, హంగూ ఆర్భాటాలకు పోకుండా సాధారణ వ్యక్తిగానే పనిచేశానన్నారు. మంథని ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు మంత్రి శ్రీధర్‌బాబు.

# ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా బాబూ మోహన్




**తెలంగాణ వీణ , హైదరాబాద్** : ప్రజాశాంతి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ మంత్రి, సినీ నటుడు బాబూ మోహన్ ను ఆ పార్టీ అధినేత కేఏ పాల్ నియమించారు. హైదరాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా కేఏ పాల్ మాట్లాడుతూ... ప్రజల కోరిక మేరకు తెలంగాణలోని మొత్తం 17 స్థానాల్లో అభ్యర్థులను నిలబెడుతున్నామని చెప్పారు. ప్రజాశాంతి పార్టీ తరపున తొలి అభ్యర్థిగా వరంగల్ స్థానానికి బాబూ మోహన్ ను ఇప్పటికే ప్రకటించామని తెలిపారు. ప్రజాశాంతి పార్టీలో బాబూ మోహన్ చేరిన తర్వాత అనేక మంది పార్టీలో చేరేందుకు వస్తున్నారని చెప్పారు. తెలంగాణలో బీజేపీకి ఓటు బ్యాంకు లేదని... అందుకే కాంగ్రెస్ లో నలుగురు ఏక్ నాథ్ షిండేలను తయారు చేసిందని కేఏ పాల్ ఎద్దేవా చేశారు. వీరిలో రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నారని... మరో నేత కూడా షిండే అయ్యే అవకాశం ఉందని చెప్పారు. వందేళ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ మంచి నీళ్లు కూడా ఇవ్వలేదని... విద్యుత్ కోతలు కూడా మొదలయ్యాయని విమర్శించారు.

# "ఇండియన్ 2" ఆలస్యం అందుకే – కమల్ హాసన్!




**తెలంగాణ వీణ , సినిమా** : యూనివర్సల్ స్టార్ హీరో కమల్ హాసన్ వరుస భారీ చిత్రాలు చేస్తూ కెరీర్ లో దూసుకు పోతున్నారు. కల్కి చిత్రం లో గెస్ట్ రోల్ లో కనిపించబోతున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఇండియన్ 2 మరియు ఇండియన్ 3 చిత్రాల పై కూడా కమల్ హాసన్ క్లారిటీ ఇచ్చారు. మంచి చిత్రాన్ని అందించేందుకు టీమ్ చాలా కష్టపడుతోంది అని అన్నారు. ఈ చిత్రాలకి సంబందించిన షూటింగ్ పూర్తి అయ్యింది అని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఇండియన్ 2 ఉందని అన్నారు.క్వాలిటీ విషయం లో రాజీపడే ప్రసక్తే లేదని, ఆలస్యం అయినా మంచి ఔట్ పుట్ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ 2 పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి అయిన తరువాత ఇండియన్ 3 చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ స్టార్ట్ అవుతుంది అని పేర్కొన్నారు కమల్. అంతేకాక శృతి హాసన్ మరియు లోకేష్ కనగరాజు లు కలిసి పని చేసిన ఒక స్పెషల్ సాంగ్ కి కమల్ లిరిక్స్ రాశారు. ఇనిమేల్ అంటూ సాగే ఈ పాట నేడు రిలీజ్ కానుంది. వీటితో పాటుగా మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ తో బిజీ కానున్నారు కమల్ హాసన్.

# యూట్యూబ్ ఛానళ్లకు కేటీఆర్ వార్నింగ్..



**తెలంగాణ వీణ , హైదరాబాద్** : యూట్యూబ్ ఛానళ్లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. తమ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కొన్ని యూట్యూబ్ ఛానెళ్లు వార్తలు ప్రసారం చేస్తున్నాయన్నారు. వ్యక్తిగతంగా.. పార్టీని దెబ్బతీయాలనే కుట్రతో ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ట్వీట్ చేశారు.'బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన యూట్యూబ్ ఛానళ్లు కొన్ని ఏలాంటి ఆధారాలు లేకుండా అడ్డగోలుగా, అసత్యాలను పదేపదే ప్రసారం చేస్తున్నాయి. ప్రజలను తప్పుదోవ పట్టించేలా తంబ్‌నెయిల్స్ పెడుతూ, వార్తల పేరుతో శుద్ధ అబద్దాలను చూపిస్తున్నాయి. గుడ్డి వ్యతిరేకత వలనో.. లేదా అధికార పార్టీ ఇచ్చే డబ్బులకు ఆశపడో ఇలాంటి నేరపూరితమైన, చట్టవిరుద్ధమైన వీడియోలను, ఫేక్‌న్యూస్‌లను ప్రచారం చేస్తున్నాయి.ఇది వ్యక్తిగతంగా నాతోపాటు, మా పార్టీని దెబ్బతీయాలన్న కుట్రలో భాగంగానే జరుగుతున్నదని భావిస్తున్నాము. కేవలం ప్రజలను అయోమయానికి గురి చేసి, తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న చర్యగా భావిస్తున్నాము. గతంలో మాపై అసత్య ప్రచారాలను, అవాస్తవాలను ప్రసారం చేసిన, ప్రచురించిన మీడియా సంస్థలపైనా న్యాయపరమైన చర్యలు ప్రారంభించాము. ప్రస్తుతం కొన్ని యూట్యూబ్ ఛానల్స్ చేస్తున్న ఈ దుర్మార్గపూరిత, కుట్రపూరిత చర్యలను చట్టబద్ధంగా ఎదుర్కొంటాం.అసత్యాలను అదేపనిగా ప్రచారం చేసి, అడ్డమైన తంబునెల్స్‌తో వార్తల పేరిట ప్రాపగండకు పాల్పడుతున్న యూట్యూబ్ ఛానళ్లపైనా పరువు నష్టం కేసులు నమోదు చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటాము. దీంతోపాటు ఆయా యూట్యూబ్ ఛానళ్లను నిషేధించాలని యూట్యూబ్‌కి అధికారికంగా ఫిర్యాదు కూడా చేస్తాం. ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలని విజ్ఞప్తి చేస్తూనే, కుట్రపూరితంగా వ్యవహారం నడిపే యూట్యూబ్ ఛానళ్లు చట్ట ప్రకారం తగిన శిక్షకు సిదంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం.' అని కేటీఆర్ ట్వీట్ చేసారు.

# హైదరాబాద్ పార్లమెంట్ పై ప్రధాన పార్టీల ఫోకస్..



**తెలంగాణ వీణ , హైదరాబాద్** : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలంగాణలోని అన్ని ప్రధాన పార్టీలు గెలుపు వ్యహాలపై తీవ్ర కసరత్తులు చేస్తున్నాయి. ఇప్పటికే ఆయా స్థానాలకు అభ్యర్థులను ఫిక్స్ చేస్తూ ఎన్నికల శంఖరావం పూరించాయి. అయితే ఈ నేపథ్యంలో తెలంగాణ పార్లమెంట్ ఎన్నికలు అనగానే మొదటగా గుర్తుకు వచ్చేది హైదరాబాద్ లోక్ సభ స్థానమే. అయితే ఆ సీటు పై ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దింపాయి. ఈ లోక్ సభ ఎన్నికల్లో ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థులను ప్రకటించాయి.హైదరాబాద్ లోక్ సభ స్థానానికి జరిగే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ ను ప్రకటించగా, హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి ఎంపీ అభ్యర్థిగా మాధవీలతను బీజేపీ ప్రకటించింది. కాగా కాంగ్రెస్ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు. 2019 లోక్సభ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గం నుంచి అసదుద్దీన్ ఒవైసీపై 14 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఓవైసీ 58.94 శాతం ఓట్లు సాధించి విజయం సాధించారు. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 44.84 శాతం ఓటింగ్ తో ఒవైసీకి 26.43 శాతం ఓట్లు లభించాయి.1989 నుంచి ఎంఐఎం వరుసగా తొమ్మిది సార్లు హైదరాబాద్ లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించింది. సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ 1984–89 మధ్య స్వతంత్ర అభ్యర్థిగా ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 1989 నుంచి 2004 వరకు సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ ఎంఐఎం ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. అయితే 2004 నుంచి అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హైదరాబాద్ స్థానంలో విజయం సాధించేందుకు బీజేపీ మరోసారి ప్రయత్నిస్తోంది. ఇక బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా ఈ స్థానంపై గురి పెట్టాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ లోక్ సభ సీటును ఎవరు గెలుచుకుంటారు అనేది రాజకీయంగా ఆసక్తిగా మారింది.

# రామ్ చరణ్ తో సుకుమార్ మూవీ అనౌన్స్ మెంట్



**తెలంగాణ వీణ , సినిమా** : గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ప్రస్తుతం గేమ్ ఛేంజర్ మూవీ రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ మూవీని శంకర్ తెరకెక్కిస్తున్నారు. ఇక దీని అనంతరం ఇప్పటికే ఉప్పెన డైరెక్టర్ బుచ్చి బాబు సనతో తన నెక్స్ట్ మూవీ కూడా అనౌన్స్ చేసారు చరణ్. ఇక ఈ రెండు మూవీస్ తరువాత క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ తో జతకట్టేందుకు సిదం అయ్యారు చరణ్. వీరిద్దరి కలయికలో రామ్ చరణ్ కెరీర్ 17వ మూవీ గా రూపొందనున్న దీనికి రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించనున్నారు.జోడు గుర్రాల పోస్టర్ తో రోరింగ్ టూ కాంకర్ అనే ట్యాగ్ లైన్ తో మేకర్స్ అయిన మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ వారు కొద్దిసేపటి క్రితం అఫీషియల్ గా ఈ మూవీని అనౌన్స్ చేసారు. గతంలో రామ్ చరణ్, సుకుమార్ ల కలయికలో వచ్చిన రంగస్థలం ఎంతో పెద్ద విజయం అందుకున్న విషయం మనకు తెలిసిందే. అయితే దానిని మించేలా మరింత అద్భుతంగా ఈ మూవీ రూపొందనుందట. ఈ క్రేజీ మూవీ గురించిన మరిన్ని వివరాలు త్వరలో ఒక్కొక్కటిగా వెల్లడి కానున్నాయి.